# ఆడు సచ్చినా...


డా. ఎ.వి. విశత్

ఏ విధమైన 'రూల్సు రెగ్యులేషన్స్' మా హాస్పిటల్‌కు సంబంధించినంతవరకు వెంకమ్మకు వర్తించవు. పేషెంటును లోపలకు పంపే స్టాఫ్‌గానీ, కార్డు తీసుకోవడంకోసం కానీ, అన్నిటిని మించి తనకు తాను అనుకుని ఆగిపోతే తప్ప తన సీరియల్ నెంబర్ వచ్చేవరకూ ఆగడంగానీ యేమీ వుండవు. సరాసరి కన్సల్టేషన్ రూమ్ లోకి వచ్చేస్తుంది.

వెంకమ్మకు డెబ్బై సంవత్సరాలుంటాయి. నాకు గుర్తున్నంతవరకూ, రంగు వెలసిన ముదురు కుంకుమ రంగు ముతక చీర, అలాగే వెలిసిన ఆకుపచ్చ రంగు వదులైన జాకెట్టు, మెళ్ళో మురికి పట్టిన పచ్చతాడు, సన్నబడిన చేతులకు రెంటికీ రెండేసి ఎరుపు మట్టిగాజులు. అక్కడక్కడా మిగిలిన నల్ల వెంట్రుకలతో కూడిన తెల్లని, పీచులాంటి జుట్టుతో జారిపోతున్న చిన్నముడి. ముఖంలో యే ప్రత్యేకత లేక పోయినా, అదో గాంభీర్యం. సన్నగా పొట్టిగా వుండే కమిలిన శరీరచ్ఛాయ. ఎప్పుడూ గోర్కి అమ్మ నవలలో, గీసిన 'సమూహ' చిత్రాలలో ఒక పాత్ర గుర్తొస్తుంది. అట్లా, ఏ హద్దూ ఆపు లేకుండా, దూసుకువచ్చినందుకు నాకూ కోపం రాదు. కారణం, వెంకమ్మ కథ కొంచెం తెలిసి వుండడమూ, దాదాపు పది సంవత్సరాల 'వైద్యుడు రోగి' అనుబంధమూను. వస్తూనే రెండు చేతులూ బల్లమీద వుంచి 'పాతిక రూపాయలు తెచ్చుకున్నాను, పది రోజులకు మందు రాసియ్యయ్యా' అని పచారి షాపులో సరుకులడిగినట్లు అడుగుతుంది.

''రాసిస్తాలే. ఇటురా. ఇటొచ్చి స్టూలుమీద కూర్చో, ఒకసారి పరీక్ష చేయనియ్''.

''ఏంది. కొత్తగా పరీచ్చించాల్సింది? అదే జబ్బు. నాలుగడుగులు యేస్తే యెగశాస! గుండె దడ – ఇగ యేమీలేదు. మందులు యేసుకుంటే ఒక తీరుగా వుంటది. మూడు రోజులు మందులు లేకపోతే – మళ్లీ మామూలే! అయే మందులు రాసియ్యయ్యా'' అని అట్లాగే నిలబడే వుంటుంది.




''సరేలే – ఆనాటికానాటికి పెద్దదానివి గావటంలా! అదే మందులు సరిపోతయ్యో – యేమన్నా డోసు అదీ మార్చాలో…'' అని అంటే, నా మాట కాదనకూడదన్నట్లు స్టూలు మీద కూర్చుని పరీక్ష చేయించుకుంటుంది.

''అయ్యో మందులే గదా – అట్టాగే మింగాల గదా'' అంటూ తుపాను యెలా వచ్చిందో అలా వెళ్తుంది. వెంకమ్మ మొగుడు పక్షవాతంతో మూడేళ్ల నుంచీ దాదాపు మంచం దిగనట్లే లెక్క. పోషణ భారమంతా వెంకమ్మదే! ఏదో నాటుమందు ఇప్పిస్తున్నది.

''లేకలేక నాకొక కొడుకు పుట్టాడయ్యా. అందరూ నన్ను గొడ్రాలిననే అనుకునేవారు. ఆడిని పెంచి పెద్దచేసి పెళ్ళి జేసినాం. నేను నెత్తినోరుబెట్టుకుని మొత్తుకుంటున్నా యినకుండా ఉన్న అరెకరం ఆడికే యిచ్చాడు. మా మావ మాకిచ్చిన పూరిల్లు అయినా వుంచుకుందాం అని అంటే 'మనదే ముందే! పోయ్యేపొద్దా – అయినా ఆడికి యేరే బోదాం అని బుద్ధిపుట్టినంక ఇయన్నీ మనల్ని రచ్చించుతయ్యా. ఏదో పోరంబోకులో నాలుగు తాటాకులేసుకుంటే పోదా' అంటూ అంతా కొడుక్కే యిచ్చాడయ్యా. అదంతా కొడుకుమీద అభిమానంతో గాదు. మనసు యిరిగి! అంతలావు కొడుకూ పెళ్లాం సేతిలో కీలుబొమ్మ అయి ఒక కట్టానికేం, సుకానికేం, వూళ్లో వున్నా ఒక్కసారి మళ్లీ మాదిక్కూ సూడలేదు. ఆడి బాబుకు పచ్చవాదం వచ్చినపుడు 'యేరా అయ్యా – ఏం జేద్దామురా!' అని అడిగేందుకు ఆడి గడప తొక్కాను. నా కొడుకింట్లో లేడు. ఆడిపెళ్లాం ఇంటికాడుంది. ఇసయం చెప్పాను. 'కన్న ఇద్దరు బిడ్డల్నే సాకలేక సస్తన్నాం – తాదూర కంతలేదు, మెడకో డోలన్నట్టు ఇప్పుడు ఆ పచ్చవాతం మావ బారం కూడానా?' అంటూ గయ్యిన లేచింది. నాకూ రోసం వచ్చింది. వూరుకోలేక 'మేము కనకపోతే, నీ మొగుడేడనుంచి వచ్చాడే' అన్నా! గదమాయించినట్టే! ఒక్క సూపు సూసింది. ఆ సూపుకు యింకోళ్లయితే బస్మమయిపోయేటోళ్లే! 'ఏడనుంచి వచ్చాడా, సంకనేసుకు తెచ్చుకున్నా – సరేనా – ఎల్లెల్లు! మా బతుకులు మమ్మల్ని బతకనియ్. మళ్లీ ఇటుగాల సూడమాక' అని గెంటినంత పనిచేసింది నా కోడలు! అయ్యాల్టి నుంచి, అన్నీ నేనే అయి యెయ్యో నాలుగు గొర్రపిల్లల్ని పెంచుకుంటూ యెల్లదీత్తున్నా – పైగా ఆడికి పచ్చవోతం. ఆడిని మంచం మీద కూకోబెట్టడం, రెండడుగులు నడిపించడం నావల్లగాదు. నా గోస గోసగాదు. ఆడు యెల్లిపోతాడేమో, ఆడటు యెల్లంగానే, నేనెటో బోవచ్చునని యెదురుజూత్తన్నాను. ఆడు సావడు. నన్ను సావనివ్వడు. ఆడికన్న ముందు నేను బోతే, ఆడి సావు కుక్కసావే గదయ్యా'' అంటూ రెండేళ్లకిందట వెంకమ్మ టూకీగా తన కథ నాకు చెప్పింది.

ఆ తర్వాత నెలకుగానీ వెంకమ్మ హాస్పిటల్‌కు రాలేదు. ఒక ఆదివారం యెవరో చాలా సీరియస్‌గా వున్న పేషంటును చూసేందుకు హాస్పిటల్‌కు వెళ్లిన సందర్భంగా హడావిడిగా వచ్చింది.




వెంకమ్మ మెల్లిగా, నా రూమ్‌లోకి వచ్చి మాట్లాడకుండా స్టూలుమీద కూర్చున్నది. మనిషిలో యెంత మార్పు వచ్చింది. నాకు తెలిసిన వెంకమ్మలా లేనేలేదు. ''ఏమైంది వెంకమ్మా'' అను అనునయంగా అడిగాను.

''ఏముంది. అంతా అయిపోయింది. నా మొగుడు సచ్చిపోయాడు. ఇవాల్టికి ఇరవై రోజులు'' కళ్లలో నీళ్లు లేవు. తనకేమీ సంబంధం లేని వేరెవరి విషయమో చెప్తున్నంత యధాలాపంగా చెప్పింది. నేనూ యేమీ మాట్లాడలేదు. ఆయనను సాగనంపేందుకే తాను బతికుండేందుకే మందులు వాడేది. ఒకవిధంగా వెంకమ్మకు 'విముక్తి' లభించినట్లనిపించింది.

''ఇగ నేనూ యెల్లిపోవచ్చు. ఇంక మందులూ మాకులూ దేనికి అని వూరుకున్నానయ్యా! ఆ బగమంతుడికి వుప్పుడిప్పుడే నన్ను తన తావుకు తీసుకెల్లడం ఇట్టం లేనట్టుంది. అసలు నన్ను మరిసిపోయాడేమో! ఆడి బాబును సాగనంపేందుకు కూడా నా కొడుకు రాలేదు. నేను కబురెట్టాను. ఆడు, ఆడి పెల్లామూ, పిల్లలూ వూల్లోనే లేరంట! ఇంటికి తాళం పెట్టి వుంది. అయ్యగారు రాకపోతే అవూస ఆగుద్దా? అన్నట్టు అంతా జరిగిపోయింది'' అని చెప్పి ఆయాసం తగ్గేందుకన్నట్లు కొంచెంసేపు మౌనంగా వుంది. తనే చెప్తుంది అన్నట్లు నేనూ వూరుకున్నాను.

''ఇగ ఈ లోకంలోకి వచ్చిన పని అయిపోయినట్లు తీరిగ్గా కాల్లుజాపి పైకిజూత్తా పడుకున్నాను'' అంటూ మళ్లీ వెంకమ్మే ఆరంభించింది. ''ఇంతలో మా యారాలు రొప్పుకుంటూ వచ్చి 'ఎంకమ్మా నీకు తెలిసిందా! నీ కొడుక్కి ఆ మాయరోగం, యేదో వచ్చిందటా! వాడు బతకడని సెప్పిండ్రంట. నీ కోడలు ఆణ్ణి దీసుకొచ్చి, యింట్లో పడేసి, పిల్లల్ని కూడా వొదిలేసి యేడకో పారిపోయిందంట' అంటూ చెప్పింది. లేసి కూసుని 'మాయరోగమేందే?' అని అడిగాను. 'అదేనే, ఇయాలరేపు ఎయిడ్స్ యేదో, మందూ మాకూ లేని జబ్బు వత్తన్నదని చెప్పుకుంటున్నారే, అదే వచ్చిందంట! మూడునెలల నుండి ఆడికి బాగుండకపోతే, ఇల్లెంట వత్తూంటారే బుడ్డబుడ్డ డాక్టర్లందరికీ సూపించారంట! ఆల్లు తమ వల్లకాదంటే నెల కిందట పెద్దాసుపత్రిలో జేర్పించినారంట!' అంది.

'ఏందే – ఇయ్యేయీ నాకు దెలవ్వే' అన్నాను. 'నీకేడ దెలుత్తది? పచ్చవాతం మొగుడు, గొర్రెలు – ఇయి దప్పక నీకేమి పట్టవుగదా! ఇగ బతకడు, దీసుకుపొమ్మని ఆ పెద్దాసుపత్రోల్లు జెప్పేసినారంట. ఇంటికి దీసికెల్లమని పంపేసినారంట! నీ కోడలు పొద్దుగాల ఆణ్ణి దీసుకొచ్చి – ఇంటికాడ దించి, పిల్లల్ని కూడ వొదిలేసి, యెటో యెల్లిపోనాది. ముదనట్టపు ముండ!' అని జెప్పిందయ్యా.''

''ఇంతకీ నీ కొడుకు బతికే వున్నాడా? ఎక్కడున్నాడు?'' అని అడిగాడు.

తలెత్తి నా వంక జూస్తూ ''ఇంకేడున్నాడు. నేనెల్లేతలికే ఆకరి చనాల్లో వున్నాడు. నన్ను చూసిండో, గుర్తుపట్టిండో లేదో గూడా తెలవదు. నిముసాల మీద జరిగిపోయింది'' అని వెంకమ్మ చెప్పింది. తన కొడుకు మరణ వార్త చెప్పేటప్పుడు కూడా వెంకమ్మ ముఖంలో విచారం గానీ, విషాదం గానీ యేభావమూ లేదు. నిర్లిప్తంగా చెప్పింది. ఆడి శవాన్ని తాకేందుకు కూడా యెవ్వరూ ముందుకు రాలేదు. ఆ రోగం అంటేనే అడిలి సత్తన్నారు. మాలో అయితే పూడుత్తారు. అదేం కుదిరేట్టు లేదు. ఆడులేని ఆ గుడిసె మాత్తరం దేనికి? ఆగుడిసె గుంజలు, బొంగులూ, తాటాకులూ పీకి, నేనే ఇంత కిరసనాయిలు బోసి దగనం సేద్దామని సిద్దమైనా! ఇంతలో పోగయిన మందిలో వున్న పాల జవలయ్య 'ఊరు మయాన నీ కొడుకును దగనం సేసి, వూరుని వల్లకాడు సేత్తావంటే యెంకమ్మా' అంటూ మీదకొచ్చిండు. 'ఏం జేసేది? ఆడిని గొయ్యితవ్వి, పూడ్చిపెట్ట నాకాడ తాకతులేదు. అంతగా వూరు వల్లకాడు కాగూడదనుకుంటే తలా ఒక సెయ్యి యేసి తరలించండి! లేదంటే నాకు జాతనయింది నే జేత్త' అని తెగించినానయ్యా. ఇంకోలెవల్లో 'ఆ పిల్లగాల్లను తీసుకు నువ్వు పోయే యెంకమ్మా! మిగతాది మేం జూత్తంలే' అన్నారు. ఇక జేసేదేముంటది. ఏ జరుగుతుందో యేమో కూడా యెరగని, ఆ పిల్లగాళ్లను దీసుకుని, నా గుడిసెకు జేరినా! ఆ రాచ్చసి యెంతపని చేసింది'' అని యెవరి కథో చెప్తున్నంత సాదాగా చెప్పింది.

''వెంకమ్మా! అయితే ఆ పిల్లల్ని కూడా నీతో యిప్పుడు తీసుకొచ్చావా? వాళ్లకు పరీక్షలు చేయించాలి! ఆ ఎయిడ్స్ వ్యాధి వాళ్లకూ వచ్చిందేమో చూసి, ఆ తర్వాత వాళ్లనేం చేయాలో ఆలోచిద్దాం'' అన్నాను. నా నోటినుంచి ఆ మాట రావడం

ఆలస్యం, వెంకమ్మ తటాలున లేచి, ''రేపు పొద్దు గాల ఆళ్లను దీసుకొత్తానయ్యా, తమరే యేదయినా దారి సూపాల'' అంటూ గబగబా వెళ్లింది.

ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు సుందరయ్యగారి శిష్యుడని జనం చెప్పుకునే రంగయ్యగారని ఒకాయన ఆధ్వర్యంలో ఒక ఛారిటబుల్ ట్రస్ట్‌వారు ''ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులైన వారి పిల్లలకోసం ఒక అనాథాశ్రమం నడుపుతున్నారు. ఆయన నాకు పరిచయం. ఆయన ఒకసారి ఆ ట్రస్టు తరపున ఒక అనాథ పిల్లవాడి పోషణ భారం వహించే 'జీవిత పోషకుల'లో ఒకరిగా వుండమని, విరాళం కోసమని వచ్చారు. మనిషి మంచివాడు. సంస్కారవంతుడు. ఉండబట్టలేక ''ఇలాంటి వ్యక్తిగత సేవా కార్యక్రమాలకు, కమ్యూనిస్టు విప్లవానికి పొంతన ఏమిటి? ఈ దారికెందుకు వచ్చారు?'' అని అడిగాను.

''అవన్నీ ఇప్పుడు దేనికిగానండీ, ఏదైనా ప్రజలు సుఖసంతోషాలతో వుండాలని జనసేవ చెయ్యడమేగా'' అని నవ్వేశారు.

ఆయనకు ఫోన్ చేసి విషయం చెప్పాను. ఆ మర్నాడు ఆయన మా హాస్పిటల్‌కు వస్తానన్నారు. అన్నట్టే ఉదయం 8 గంటలకల్లా ఆయన, ఇద్దరు ట్రస్టు సహాయకులతో సహా హాస్పిటల్‌కు వచ్చారు. అప్పటికే వెంకమ్మ తన మనవళ్లనిద్దరినీ తీసుకుని వచ్చివుంది. పిల్లలిద్దరూ - కవలల్లే వున్నారు. ఏడాది, ఏడ్డర్థం మించి తేడావుండదు. అయిదారేళ్లు వుంటాయి. అభం శుభం తెలియని అమాయక బిడ్డలు! రంగయ్యగారు పిల్లల్ని తమ ఆశ్రమానికి తీసుకెళ్లేందుకు సిద్ధపడ్డారు. అయితే ఒక ప్రొసీజర్ వుందట! వీళ్ల తల్లిదండ్రులు ఎయిడ్స్ వల్లనే చనిపోయారని, ఇంకా యితర సర్టిఫికెట్ కావాలట! రంగయ్య గారే వెంకమ్మతో ''నీ కొడుకును, యేదో పెద్దాసుపత్రిలో జేర్చారన్నావుగా... అక్కడి కాగితాలేమైనా వున్నాయా?'' అని అడిగారు. ''నాకేం దెలవదయ్యా. ఆ రాచ్చసిముండ, ఈళ్ల తల్లికాడేమైనా వున్నాయేమో! అదేమో... ఇంకోడికెవరికో ఆ రోగం తగిలించేందుకు, బిడ్డల్ని కూడా వొదిలేసి పరారయ్యింది'' అంది వెంకమ్మ.

''అలాంటి మాటలెందుకులేమ్మా'' అని వెంకమ్మతో రంగయ్యగారు అని నావైపు తిరిగి, ''మీరు అంత శ్రద్ధ తీసుకుని, రాత్రికి రాత్రి ఫోన్ చేశారంటేనే వేరే సర్టిఫికెట్లు అనవసరం. కొన్ని రూల్సు వుంటాయిగదా. అయినా మధురాంతకం రాజారాం గారన్నట్టు ఏమిటో రూల్సులు - మనిషికోసం రూల్సా - రూల్సుకోసం మనుషులా? అనిపిస్తుంది. ముందు, ఈ పిల్లల్ని మా ఆశ్రమానికి తీసుకువెళ్తాను. ఒక వారం రోజులలో అన్నీ సేకరించగలం లెండి'' అంటూ, పిల్లల్ని, వెంకమ్మనీ తీసుకుని ఆయన వెళ్లారు.

ఆ తర్వాత నేను హాస్పిటల్ పని ఆరంభించేందుకు, నా కన్సల్టేషన్ రూమ్‌లోకి వెళ్లాను. ఇంతలో ''నేనా ముసిల్దాని కోడలినయ్యా. ఆ 'రాచ్చసిముండ'ని నేనే!'' అంటూ ఒకామె నా కన్సల్టేషన్ రూమ్‌లోకి వచ్చి నా కాళ్లను చుట్టేసినంత పని చేసింది. 'నేను పొద్దుగాలే వచ్చానయ్యా. మా అత్త ఈడకి వచ్చిందని తెలిసి, ఆ ముసిల్దాని కంటపడితే, రాల్లతో కొట్టించి సంపిత్తదని దడిసి, ఇప్పటిదాకా దాంకొని, ఆల్లటు యెల్లగానే మిమ్మల్ని కలిసి, యిసయం జెప్పేందుకు వచ్చానయ్యా! అయినా అట్టా జేసినా మా అత్తనెవరు తప్పుబడతారు? నా రాత...'' అంటూ మొదలెట్టింది. నాకు మొదటినుంచి, వెంకమ్మ, ఆమె తీరు తెలుసు గనుక, వెంకమ్మ వివరించిన పరిస్థితిని బట్టి, ఆమె కోడలి పట్ల నాలో విముఖత అప్పటికే ఏర్పడి వుంది.

''ఇప్పుడేం జేద్దామని వచ్చావు?'' అని అడిగాను. నా కంఠంలో కొంచెం కాఠిన్యం ధ్వనించినట్లుంది. నిజానికి, ఆ విముఖతకు, కాఠిన్యానికి నాకే సరైన సమాధానం లేదు. అలా వుండాల్సింది కాదు.

''తమరింతకన్నా యేంజేయాలయ్యా. అంతా యిన్నాను. ఆయనకిజబ్బు అని తెలంగానే, నాకూ పరీచ్చ జేశారు. నాకూ ఆ జబ్బు వచ్చిందని తేలింది. ఇక బతుకు బుగ్గయినట్టనిపించింది. నేనూ ఆటేకాలం బతకను! బతికినన్నాళ్లయినా, ఆడదాన్ని, అందులో ఈ జబ్బు వున్నదని తెలిస్తే నన్నూ, నా పిల్లల్నీ యెవురైనా దగ్గరికి రానిత్తారయ్యా. ఎవుల్ల పనిత్తారు? ఎట్టా సాకాల? ఏడికిబోయి సాకాల! పైగా నా పిల్లలకూ పరీచ్చలు జేసారయ్యా. బగమంతుడి సిత్రం యేందో. ఆళ్లిదరికీ, ఆ జబ్బు సోకలేదంట! ఆ జబ్బుతో వున్న నాతో వుంటే, ఆ పిల్లగాళ్లకు కూడా ఆ రోగం వత్తందేమోనని శానా దిగులుపడ్డానయ్యా. ఇక గత్తెంతరం లేకనే, సావుబతుకుల్లో వున్న నా మొగుణ్ని, పసికూనల్లాంటి నా బిడ్డల్నీ - మా వూళ్లో దించి పరారయ్యానయ్యా! నా అత్త సంగతి నాకు తెలుసు, గట్టిది. ఎట్టాగో దాని బొందిలో వూపిరున్నంతవరకూ నా బిడ్డల్ని సాగుతుంది అనే ధైర్నంతోనే వొదిలేసి పోయానయ్యా. నాలాంటి దానికి, ఇట్టాంటి శాస్తి జరగాల్సిందే. కొడుకు వుండి కూడా ఆ ముసలాల్లను అనాదుల్ని చేశాను. ఇప్పుడు తల్లిని నేనుండి కూడా నా బిడ్డలు అనాదలైనారు. నిజానికి నా మావ పచ్చవాతంతో మంచానబడేనాటికే, నా మొగుడికి వంట్లో నలత మొదలైంది. నేనే ఎట్టాగో కూలీనాలీ జేసి, తినీతినక కాలం నెట్టుకొచ్చాను. తమరు నమ్మరేమోగానయ్యా.. సత్తిపెమానకంగా, నా బిడ్డల మీద ఒట్టేసి చెబుతున్నా - నా మొగుడు దప్ప పరాయి మొగాడి పొందు నేనెరగనయ్యా...'' అంటూ భోరున ఏడుస్తున్నది. ఏం జేయాలో - ఏం మాట్లాడాలో నాకు వెంటనే పాలుపోలేదు.

''ఇంతకీ ఆ పెద్దాసుపత్రి వాళ్లిచ్చిన కాగితాలు యేమైనా వున్నయ్యా?'' అని అడిగాను.

''ఉన్నయ్యయ్యా. అన్నీ దెచ్చినా.. నా కెందుకు అయి అన్నీ..'' అంటూ ఒక ప్లాస్టిక్ కాగితం సంచి నాకందించింది. నేనా కాగితాలు చూస్తున్నాను. అవసరమైనవన్నీ వున్నాయి. చూస్తున్న కాగితాల్లోంచి బయటపడి తలెత్తేసరికి గదిలోంచి వెళ్లి, బయట కిటికీ దగ్గర నిలబడి చేతులు జోడిస్తూ - ఏడుస్తూ వున్న ఆమె కన్పించింది. నా మనసు ద్రవించింది. లోపలకు రమ్మని సైగ చేశాను. రాలేదు. ఎంతసేపు చూసి ఎందుకు రాలేదా అని బయట స్టాఫ్‌తో ఆమెను లోపలికి పంపండి అన్నాను. అప్పటికే పరుగులాంటి నడకతో రోడ్డు దాటి వెళ్లింది. నేనే బయటకు వచ్చి చూశాను. తాను రానన్నట్లు సైగలు చేస్తూ ఆమె వెళ్లింది. నేను లోపలకు వచ్చి మా కాంపౌండర్‌ను పిలిచి ఆ కాగితాలు భద్రంగా తీసుకుని, ఆశ్రమం రంగయ్యగారికి యివ్వమని చెప్పాను. ఆ సంచిలోంచి యేదో పుస్తకం కిందపడింది. వెంకమ్మ కొడుకు తాలూకు అరెకరం భూమికి రైతు పట్టాదారు పాస్ పుస్తకం!

★



పాతికేళ్ళ లలనామణి పాపం ఇబ్బంది పడుతోంది. ఇంతకీ ఆ ఇబ్బంది ఏంటీ అని అడిగితే ఒంటరితనమేనంటోంది. 'బంగారూ నువ్వేలే నా నిండు చందురుడూ' అంటూ తెలుగులో 'సూపర్' సినిమాలో నటించిన అయేషా టకియాకు ఒంటరితనం బాగా బోరుకొడుతోందిట. ఎంతైనా బాయ్‌ఫ్రెండ్ వెంట వున్నదానికి ఏదీ ఈక్వల్ కాదని చెబుతోంది. మరి బాయ్‌ఫ్రెండ్‌ను చూసుకోలేక పోయావా అని అంటే మాత్రం అయ్యబాబోయ్.. కెరీర్‌లో అప్పుడే బాయ్‌ఫ్రెండూ, ప్రేమా పెళ్లీ అన్నామంటే ఇంకేమైనా వుందా అంటూ నవ్వుతోంది. సెట్స్‌లోకి వెళ్ళినప్పుడు అంతగా బోర్ ఫీలవను గానీ, ఇంటిదగ్గరున్నప్పుడే బాగా ఇబ్బంది అనిపిస్తోంది. అంటే ఇక లైన్ క్లియర్ చేసుకునేందుకు అయేషా ప్లాన్ చేసుకుంటున్నట్టు బాలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది. మరో రెండేళ్ళలో అయేషా పెళ్లిచేసుకుంటుందేమో అనిపిస్తోంది!

## ఒంటరితనం బోరనిపిస్తోంది!